బొగ్గు గనుల వేలం ఆపండి

ప్రధాని మోదీకి ఆర్ కృష్ణయ్య లేఖ

హైదరాబాద్, జూన్23 (నమస్తే తెలంగాణ): బొగ్గు గనుల వేలాన్ని కేంద్రప్రభుత్వం ఆపాలని, జాతీయ సంపదను కాపాడాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ విషయమైన పార్లమెంట్ సమావేశాల్లో చర్చిస్తామని తెలిపారు. ఈ మేరకు ప్రధాని మోదీకి కృష్ణయ్య ఆదివారం ఓ లేఖ రాశారు. వేలం వేసే గనులను సింగరేణి సంస్థకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీల ఎంపీలు జోక్యం చేసుకొని బొగ్గు గనుల వేలం ఆపివేయించాలని, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు.

నేడు గడ్కరీతో కోమటిరెడ్డి భేటీ

హైదరాబాద్, జూన్ 23(నమస్తే తెలంగాణ): కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి సోమవారం ఢిల్లీలో భేటీ కానున్నారు. రాష్ట్రంలోని వివిధ రోడ్డు ప్రాజెక్టులపై జరిగే ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు నిర్మాణంతో పాటు రాష్ట్రంలోని వివిధ స్టేట్ రోడ్ల అప్‌గ్రేడేషన్‌పై గడ్కరీతో చర్చించనున్నారు. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టును తామే పూర్తిస్థాయిలో చేపట్టేలా అనుమతులు ఇవ్వాలని, భూసేకరణ ఖర్చులను మాత్రం పూర్తిగా కేంద్రమే భరించాలని కోమటిరెడ్డి ఈ సందర్భంగా కోరనున్నారు.

కాంగ్రెస్‌లోకి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్‌కు చెందిన సంజయ్ కుమార్‌ను ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం సార్.. సమస్యలు తీర్చండి

- పీఆర్సీ, పెండింగ్ డీఏ విడుదల చేయండి
- ముఖ్యమంత్రి రేవంత్‌తో ఉపాధ్యాయ సంఘాల భేటీ
- పదోన్నతులు కల్పించడంతో సీఎంకు ధన్యవాదాలు

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పలు ఉపాధ్యాయ సంఘాలు సీఎం రేవంత్‌రెడ్డిని కోరాయి. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు సమర్పించాయి. పీఆర్సీ సహా పెండింగ్ డీఏలను విడుదల చేయాలని విజ్ఞప్తిచేశాయి. టీచర్ల బదిలీలు, పదోన్నతుల నేపథ్యంలో పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆదివారం హైదరాబాద్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా భాషాపండితులు, పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించడం, టీచర్ల బదిలీలు, పదోన్నతులు కల్పించడంపై ఉపాధ్యాయ సంఘాల నేతలు, ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపాయి. టెట్‌తో నిమిత్తం లేకుండా టీచర్లకు పదోన్నతులు కల్పించడాన్ని పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, డాక్టర్ పర్వతి సత్యనారాయణ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. రెవెన్యూ డివిజన్ల తరహాలో విద్యా డివిజన్లను ఏర్పాటుచేయాలని తెలంగాణ గెజిడెట్ హెడ్మాస్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రప్రకాశ్, రాజగంగారెడ్డి, తుకారం వినతిపత్రం సమర్పించారు. భాషాపండితులకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు కల్పించినందుకు ఆర్‌యూపీపీ టీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మమ్మద్ అబ్దుల్లా, తిరుమల కాంతికృష్ణ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషన్ శ్రీదేవసేన, టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, ఎస్జీటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, వెంకటేశం, టీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్లా, రాజిరెడ్డి, స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ నేతలు, ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, గౌరీశంకర్‌రావు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న టిగారియా రాష్ట్ర ప్రతినిధి బృందం

స్పౌజ్ కేసులన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి టిగారియా వినతి

హైదరాబాద్, జూన్23 (నమస్తే తెలంగాణ): 317 జీవో ద్వారా జరుగుతున్న ఉద్యోగ కేటాయింపుల్లో స్పౌజ్ కేసులనే కాకుండా, సెంట్రల్, పబ్లిక్ సెక్టార్ మిగతా అన్ని స్పౌజ్ కేసులను రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టిగారియా) డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను మాత్రమే పరిగణనలోకి తీసుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టిగారియా అధ్యక్షుడు మామిడి నారాయణ, జనరల్ సెక్రటరీ డాక్టర్ మధుసూదన్, టీజీ సోషల్ వెల్ఫేర్ అధ్యక్షుడు నరసింహులుగౌడ్, జనరల్ సెక్రెటరీ ఎస్ గణేష్ ఆదివారం ప్రత్యేకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సెంట్రల్ గవర్నమెంట్, జ్యుడీషియరీ, రైల్వేలు, బ్యాంకులు, ఇతర పబ్లిక్ సెక్టర్ల ఉద్యోగులకు కూడా అవకాశం కల్పించాలని కోరారు. ఆయా డిమాండ్లపై సీఎం సానుకూలంగా స్పందించారని టిగారియా ప్రతినిధులు వెల్లడించారు. తగిన సూచనలతో ఆయా శాఖలకు ఆదేశాలు జారీచేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

పలు ఉపాధ్యాయ సంఘాల నేతల అసంతృప్తి

కొంత మంది ఉపాధ్యాయ సంఘాల నేతలు ఈ సందర్భంగా తమ అసంతృప్తి వ్యక్తంచేశారు. వచ్చామా.. ఫొటో దిగామా.. వినతిపత్రాన్ని ఇచ్చామా అన్నట్టుగా భేటీ సాగిందని, కేవలం ఫొటోలు దిగి, వినతిపత్రాలు తీసుకొని మమ అనిపించారని కనీసం తమ సమస్యలను వినలేదని, మొర ఆలకించలేదని పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆవేదన వ్యక్తంచేశారు.

'నీట్' లీకేజీపై విద్యార్థి సంఘాల కన్నెర్ర

- కరీంనగర్‌లో బండి సంజయ్ ఇంటి ముట్టడికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు.. నాయకుల అరెస్ట్

విద్యానగర్, జూన్ 23: నీట్ యూజీ, యూజీసీ నెట్ పరీక్షా పత్రాల లీకేజీపై విద్యార్థి, యువజన సంఘాల ఐక్యకార్యాచరణ సమితి కన్నెర్రజేసింది. పరీక్ష రాసిన 24 లక్షల మంది విద్యార్థుల భవితవ్యంపై నోరు మెదపని కేంద్రమంత్రి బండి సంజయ్ ఇంటిని ఆదివారం ముట్టడించింది. బండికి కేంద్ర మంత్రిగా కొనసాగే నైతిక హక్కు లేదని మండిపడింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తా నుంచి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ క్యాంపు ఆఫీస్ వద్దకు ర్యాలీగా వెళ్లి ముట్టడికి యత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. విద్యార్థులు, నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మాట్లాడుతూ.. బండి సంజయ్‌కి మత రాజకీయాలపై ఉన్న శ్రద్ధ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌పై లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే పేపర్ లీకేజీలకు పాల్పడుతూ విద్యార్థుల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉద్యమం చేస్తుంటే ప్రధాని మోదీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. దమ్ముంటే 'చాయ్ పే చర్చ' మాదిరిగా.. నీట్ పేపర్ లీకేజీపై చర్చించాల్సిందిగా మోదీని అడగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్, నేతలు బాలసాని లెనిన్, రామారావు వెంకటేశ్, మచ్చ రమేశ్, అరవింద్, గజ్జల శ్రీకాంత్, రాణా ప్రతాప్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అరెస్ట్‌చేస్తున్న పోలీసులు

అనర్హుల పింఛన్లు, రేషన్ కార్డులు రద్దుచేస్తాం

ఆగస్టు 15లోగా రుణమాఫీ పూర్తి

ఖమ్మం రూరల్ పర్యటనలో మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్, జూన్ 23: అర్హులందరికీ పింఛన్లు, రేషన్‌కార్డులు అందజేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అదే సమయంలో అనర్హులు పొందుతున్న పింఛన్లను రద్దు చేస్తామని, రేషన్ కార్డులను తొలగిస్తామని స్పష్టంచేశారు. ప్రభుత్వ పథకాల్లో పేద కుటుంబాలకే ప్రథమ ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. ఆదివారం ఆయన ఖమ్మం రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన, స్థానికుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం నాయుడుపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పారు. జూలై 1 నుంచి ఆగస్టు 15లోగా అర్హత కలిగిన ప్రతి రైతుకూ రూ.2 లక్షల్లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని తెలిపారు.

ఖమ్మం మండలం నాయుడుపేటలో కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న మంత్రి పొంగులేటి

శ్రీవారి సర్వ దర్శనానికి 24 గంటల సమయం

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతున్నది. టోకెన్ లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతున్నదని టీటీడీ వర్గాలు తెలిపాయి. శనివారం శ్రీవారిని 74,467 మంది భక్తులు దర్శించుకొన్నారు. 40 వేల మంది తలనీలాలు సమర్పించుకొన్నారు. హుండీ ఆదాయం రూ.3.77 కోట్లు వచ్చినట్టు టీటీడీ వర్గాలు వెల్లడించాయి.



సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ

చెంచు మహిళకు 25 లక్షలు ఇవ్వాలి

- దాడి ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ

హిమాయత్‌నగర్, జూన్ 23: లైంగిక దాడికి గురైన నాగర్‌కర్నూల్ జిల్లా మొలచింతలపల్లి గ్రామానికి చెందిన చెంచు మహిళ కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధిత మహిళకు ప్రభుత్వ ఉద్యోగం, భూమి ఇవ్వాలని కోరారు. దాడి ఘటనపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇసుక మాఫియా గూండాలు ఆ మహిళపై లైంగిక దాడి చేసి హత్య చేసేందుకు యత్నించారని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. చెంచులపై జరుగుతున్న దాడులపై రాష్ట్ర హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి విచారించాలని కోరారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు ప్రసాద్, సుధాకర్, వీరన్న, శివుడు, రమేశ్ పాల్గొన్నారు.

ఈశ్వరమ్మకు మెరుగైన వైద్యం అందించాలి

ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 23: నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానలో చికిత్స పొందుతున్న మొలచింతలపల్లి ఆదివాసీ మహిళ ఈశ్వరమ్మను ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్, కలెక్టర్ బదావత్ సంతోష్, బీజేపీ నేతలు భరత్‌ప్రసాద్, సుధాకర్‌రావు ఆదివారం పరామర్శించారు. అంతకుముందు జాటోత్ హుస్సేన్‌నాయక్, భరత్‌ప్రసాద్ మొలచింతలపల్లి గ్రామాన్ని సందర్శించి ఘటనపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా హుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ.. ఆమెకు అందిస్తున్న చికిత్సపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయంగా 6 లక్షలు చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, పిల్లలను రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివించాలని సూచించారు. ఈశ్వరమ్మ కుటుంబానికి 25 ఏండ్ల కింద ప్రభుత్వం ఇచ్చిన వ్యవసాయ భూమి, ఇంటి పత్రాలను వెంటనే వారి పేర చేయాలని అధికారులకు ఆయన చెప్పారు.

ఈశ్వరమ్మ మామను హత్య చేశారా?

- చెంచు మహిళ ఘటనలో మరో మలుపు
- ఈనెల 4న నాగయ్య అనుమానాస్పద మృతి
- పోస్టుమార్టం లేకుండానే అంత్యక్రియలు

మహబూబ్‌నగర్, జూన్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/కొల్లాపూర్: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో ఇటీవల చెంచు మహిళపై జరిగిన దాష్టీకాన్ని మరువక ముందే అదే గ్రామంలో ఆమెకు వరుసకు మామ అయ్యే వ్యక్తి ఈనెల 4న అనుమానాస్పదస్థితిలో మరణించాడు. ఈశ్వరమ్మ ఘటనకు, ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఆమె మామ మృతి కేసుకు సంబంధం ఏమైనా ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామంలో బండి వెంకటేశ్, బండి శివ.. చెంచు ఈశ్వరమ్మ (దాష్టీకానికి గురైన బాధితురాలు) మామ వీరస్వామికి చెందిన భూమి ని ఎకరాకు రూ.2.25 లక్షల చొప్పున రెండున్నర ఎకరాలు కొనుగోలు చేసి అగ్రిమెంట్ చేసుకున్నారు. చెంచు నాగయ్య (ఈశ్వరమ్మకు వరుసకు మామ) ఈ అగ్రిమెంట్‌కు అడ్డు తగిలాడు. ఎకరాకు రూ.18 లక్షల నుంచి రూ.25 లక్షలు పలుకుతుండగా.. తక్కువ ధరకు ఎలా కొనుగోలు చేస్తారని ప్రశ్నించినట్టు సమాచారం. 'మా వర్గానికి చెందిన భూమిని చెంచు లే కొనుగోలు చేస్తారు.. మీరు కొనొద్దు' అంటూ బండి వెంకటేశ్, బండి శివకు నాగయ్య సమాధానమిచ్చాడు. అయితే, ఈ నెల 3న రాత్రి తన బావమరిది కురుమయ్య గ్రామమైన రాయరాజులపెంటకు వెళ్లి వస్తానని నాగయ్య తన ఇంట్లో చెప్పాడు. 4న నల్లమల అడవిలో నాగయ్య శవమై కనిపించాడు. నాగయ్యకు పోస్టుమార్టం చేయకుండానే అదే రోజు అంత్యక్రియలు పూర్తిచేశారు. ఆయన అనుమానాస్పద మృతి వెనుక భూవివాదం కూడా కారణమై ఉండొచ్చనే సందేహం కలుగుతున్నది. కాగా చెంచు నాగయ్య మర్మాంగంపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసినట్టు స్థానికులు చెబుతున్నారు. తన తండ్రిని హత్య చేసినందున పోస్ట్‌మార్టం చేయించాలని అతని కొడుకు సలేశ్వరం అప్పుడే కోరగా.. అందుకు కొందరు వ్యతిరేకించినట్టు తెలిసింది. చెంచు ఈశ్వరమ్మపై జరిగిన దాడి బయటకు రావడంతోనే నాగయ్యది హత్యేనన్న అనుమానులకు బలం చేకూరింది.

రేవంత్ సిఫారసులకు ఢిల్లీలో బ్రేక్!

మొదటిపేజీ తరువాయి...

తరువాత అన్న విధంగా కాంగ్రెస్ పార్టీలో పరిణామాలు జరుగుతున్నాయనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

నామినేటెడ్ పోస్టులు

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడటానికి సరిగ్గా ఒకరోజు ముందు 37 నామినేటెడ్ పోస్టులకు చైర్మన్లను సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆ మరుసటిరోజే ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో కోడ్ ముగిశాకే నామినేటెడ్ పోస్టులకు ఉత్తర్వులు జారీ చేస్తామని వెల్లడించారు. ఎన్నికల కోడ్ ముగిసి మూడు వారాలు గడిచినప్పటికీ, నామినేటెడ్ పోస్టులకు సంబంధించిన ఉత్తర్వులు జారీ కాలేదు. అయితే, రాష్ట్రంలో అధికారంలో ఉండి కూడా పార్లమెంట్ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలను సాధించకపోవడంతో ఈ జాబితాను అధిష్ఠానం పునః సమీక్షిస్తున్నట్టు తెలిసింది. ప్రకటించిన నామినేటెడ్ పోస్టులకు ఉత్తర్వులు జారీ కాకుండా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ అడ్డుకున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. రేవంత్‌రెడ్డి సిఫారసు మేరకు కాకుండా పార్లమెంట్ ఎన్నికల ఫలితాల ఆధారంగా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలన్నది అధిష్ఠానం తాజా అభిప్రాయమన్నది ఈ వర్గాల సమాచారం. గతంలో ప్రకటించిన 37 పోస్టులతోపాటు మరో 15-20 నామినేటెడ్ పోస్టుల జాబితాను ఈసారి తాజాగా దీపాదాస్‌మున్షీతో కలిసి కసరత్తు చేసినట్టు తెలిసింది. నామినేటెడ్ పోస్టులకు ఎంపిక బాధ్యతను రేవంత్‌రెడ్డికి ఒక్కరికే అప్పగించకుండా తాజా జాబితాను పార్టీ పరిశీలకురాలితో కలిసి ఖరారు చేయాలని అధిష్ఠానం ఆదేశించినట్టు సమాచారం.

విస్తరణ, పీసీసీ అధినేత ఎంపికలోనూ అధిష్ఠానం మార్క్?

మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుని ఎంపికలోనూ అధిష్ఠానం తన మార్క్ చూపించబోతున్నదని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పార్టీపై, ప్రభుత్వంపై తన ఆధిపత్యానికి ఢోకా లేకుండా మంత్రివర్గ విస్తరణ, కొత్త పీసీసీ అధ్యక్షుని ఎంపిక జరగాలని సీఎం రేవంత్ యోచిస్తుండగా, అధిష్ఠానం మాత్రం పార్టీ, ప్రభుత్వం భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తన మార్క్‌ను మంత్రివర్గ విస్తరణలో, పీసీసీ అధ్యక్షుడి ఎంపిక విషయంలో కనబర్చబోతున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. ఏతావాతా ఈ పరిణామాలన్నీ అధిష్ఠానం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి పరపతి తగ్గిందనడానికి నిదర్శనంగా సీనియర్ నాయకుడు ఒకరు విశ్లేషించారు. సీఎం రేవంత్‌రెడ్డి పట్ల అధిష్ఠానంలో వచ్చిన మార్పును మంత్రులు, సీనియర్ నేతలు పసిగట్టాకే, వారు నేరుగా పార్టీ పెద్దలకు ఎప్పటికప్పుడు ఇక్కడి సమాచారాన్ని చేరవేస్తూ చేరువ కావడానికి ప్రయత్నిస్తున్నారని, వారిని అధిష్ఠానం ప్రోత్సహిస్తున్నదన్న అనుమానాన్ని సీఎం సన్నిహితవర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల కొందరు మంత్రులు సీఎంకు సమాచారం లేకుండానే రహస్యంగా ఢిల్లీ వెళ్లి పార్టీ పెద్దలను కలిసి వచ్చినట్టు ఈ వర్గాలు చెప్తున్నాయి. మొదటినుంచీ కాంగ్రెస్ పార్టీలో ఉన్నవారిని కాకుండా సీఎం రేవంత్‌రెడ్డి, పూర్వాశ్రమంలో తనతో కలిసి టీడీపీలో ఉన్న వారికే పార్టీలో, ప్రభుత్వంలో ప్రాధాన్యం కల్పించడాన్ని సీనియర్ మంత్రులు జీర్ణించుకోలేకపోతున్నట్టు సమాచారం. కడియం శ్రీహరి, పట్నం మహేందర్‌రెడ్డి, తాజాగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి తదితర ముఖ్య నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడాన్ని వీరు తప్పుబడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విధానాలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని ఇచ్చే బాధ్యతను సీఎం రేవంత్‌రెడ్డి ఇద్దరు మంత్రులకు అప్పగించడం పలువురు సీనియర్ మంత్రులకు మింగుడుపడటం లేదన్న ప్రచారం జరుగుతున్నది.

పార్లమెంట్ ఫలితాలపై త్రిసభ్య కమిటీ

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గతం కంటే మెరుగైన ఫలితాలను సాధించినప్పటికీ, ఆ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మాత్రం ఆశించిన స్థాయిలో కాకుండా పేలవమైన ఫలితాలు రావడం అధిష్ఠానాన్ని నిరాశపరిచింది. తెలంగాణలో 17 ఎంపీ సీట్లలో 14 సీట్లు టార్గెట్‌గా పెట్టుకొని కనీసం 12 సీట్లు సాధించాలని రేవంత్‌రెడ్డికి అధిష్ఠానం టార్గెట్ విధించింది. కానీ, ఎనిమిది ఎంపీ సీట్లతోనే కాంగ్రెస్ సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఐదు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 64 ఎమ్మెల్యే సీట్లు గెలుచుకున్నప్పటికీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎనిమిది సీట్లకే పరిమితం కావడం పట్ల అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఆశించిన ఫలితాలు రాకపోవడానికి గల కారణాలపై రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ నుంచి నివేదిక కోరింది. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు ఏకం కావడం వల్ల ఆశించిన ఫలితాలు రాలేదని ఆమె నివేదిక ఇచ్చినట్టు సమాచారం. ఫలితాల అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఇదే విషయాన్ని మీడియాకు వెల్లడించిన విషయం తెలిసిందే. దీపాదాస్‌మున్షీ పంపిన నివేదికలో సైతం రేవంత్‌రెడ్డి చేసిన వాదనే ఉండటంతో అధిష్ఠానం సంతృప్తి చెందలేదని తెలుస్తున్నది. ఇతర మార్గాల ద్వారా అధిష్ఠానం సేకరించిన నివేదికలో మరోరకమైన అభిప్రాయం వ్యక్తమైనట్టు సమాచారం. అభ్యర్థుల ఎంపికలో రేవంత్‌రెడ్డి చేసిన తప్పిదాలు, పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలుగా వ్యవహరించిన మంత్రులకు ఎమ్మెల్యేలతో సమన్వయం లేకపోవడం వంటివి ఆశించిన ఫలితాలు రాకపోవడానికి కారణమని తేలినట్టు సమాచారం. దీంతో నిజనిర్ధారణకు ఏఐసీసీ తిరిగి ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయంతో అధిష్ఠానం ఏకీభవించలేదనడానికి ఈ పరిణామమే నిదర్శనమని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

- మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ అధిష్ఠానంతో చర్చలు

హైదరాబాద్, జూన్ 23(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీ వెళ్లనున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీతో ఆయన భేటీ కానున్నట్టు సమాచారం. రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణతోపాటు నామినేటెడ్ పోస్టుల భర్తీ, కొత్త పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై ఈ సందర్భంగా వారితో చర్చించే అవకాశం ఉన్నది. లోక్‌సభ ఎన్నికలకు ముందు నిలిపివేసిన వివిధ కార్పొరేషన్ల చైర్మన్ల జాబితాపైనా అధిష్ఠానంతో చర్చించే అవకాశం ఉన్నది. లోక్‌సభ ఎన్నికల్లో తక్కువ సీట్లు రావడంపైనా ఆయన వివరణ ఇవ్వనున్నట్టు తెలిసింది. సోమవారం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభంకానున్న సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలతో సీఎం భేటీ అవుతారని తెలిసింది.

హనుమకొండ జడ్పీ చైర్మన్‌కు అవమానం

- మాట్లాడుతుండగా మైకు లాక్కున్న మంత్రి పొన్నం ప్రభాకర్
- భీమదేవరపల్లి అంబేద్కర్ విగ్రహావిష్కరణలో ఘటన

భీమదేవరపల్లి, జూన్ 23: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గాంధీనగర్‌లో ఆదివారం జరిగిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభలో జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ అవమానానికి గురయ్యారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు జడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 239 ఉన్న ఎస్సీ రెసిడెన్షియల్ స్కూళ్లను 1000కి పెంచినట్టుగా తెలిపారు. విద్యార్థుల సంక్షేమం కోసం ఎస్సీ రెసిడెన్షియల్ స్కూళ్ల సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దళితుల అభ్యున్నతి కోసం దళితబంధు పేరిట అప్పటి ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చిందని, ప్రస్తుత ప్రభుత్వం అంబేద్కర్ అభయహస్తం కింద దళిత, గిరిజనులకు ఒక్కో కుటుంబానికి రూ.12 లక్షలు ఇవ్వాలని కోరారు. దీంతో పక్కనే ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ కలుగజేసుకుని అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభలో రాజకీయాలు మాట్లాడొద్దంటూ సుధీర్‌కుమార్ చేతిలో